సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్

ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ నాయకులు విమర్శించారు

- 9లో



ఐదేళ్లుగా ఎన్నికలు లేవు!

చేనేత సహకార సంఘాలకు ఐదేళ్లుగా ఎన్నికలు లేవు.2018 ఫిబ్రవరిలో పాలకవర్గాల గడువు ముగిసింది.

- 9లో

గరిష్టం/కనిష్టం 35°/17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

భువనగిరి మహిళా పీఎస్ సీఐగా జానకిరెడ్డి

భువనగిరి : భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా ఎస్.జానకిరెడ్డి నియమితులయ్యారు. ఆయన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా ఉన్న బి.జగదీశ్వర్‌రావు మాల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు రాచకొండ సీపీ దేవేంద్రచౌహాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

262 మందికి జరిమానా



యాదగిరిగుట్టలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 262 మందికి ఆలేరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించింది. ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా వేసినట్లు ట్రాఫిక్ సీఐ కె.శివశంకర్‌గౌడ్ శనివారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఇందులో 262 మంది పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి 122 బైక్‌లు, త్రీవ్ వీలర్ 7, ఫోర్ వీలర్ వాహనాలు 133 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 262 మంది నుంచి జరిమానా రూపంలో రూ.5,24,000 వచ్చినట్లు పేర్కొన్నారు.

బెల్లి యాదయ్యకు జాషువా స్మారక పురస్కారం



పురస్కారం అందజేస్తున్న ఇనాక్, నిఖిలేశ్వర్

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్, సాహితీవేత్త డాక్టర్ బెల్లి యాదయ్య జాషువా స్మారక జాతీయ పురస్కారం అందుకున్నారు. పాలపిట్ట తెలుగు జాతీయ సాహిత్య మాసపత్రిక, విమల సాహితీ సంస్థలు దీపావళి సందర్భంగా సంయుక్తంగా జాతీయస్థాయి కవితల పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో బెల్లి యాదయ్య రాసిన నది పిలుస్తున్నది కవిత తృతీయ బహుమతికి ఎంపినది. ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్ చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేశారు. మేడ్చల్‌జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి నది పిలుస్తున్నది కవితా విశేషాలను సభికులకు వివరించారు. ప్రిన్సిపాల్ యాదయ్యకు జాతీయ పురస్కారం లభించడం పట్ల కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయం



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ఎజెండాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌కు చెందిన 50 మంది యువకులు నక్కల రాజిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు ఇలా అనేక పథకాలు విజయవంతంగా అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, కౌన్సిలర్లు దారెడ్డి మంజుల వేణురెడ్డి, కొంగరి కృష్ణ, బాలచంద్రం, మల్లారెడ్డి, కొండమడుగు రోషన్, మల్లయ్య, పాండు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంచ నారసింహుడికి నిత్యారాధనలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి.వేకువజామున సుప్రభాతం, ఆరాధన, నిజాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన చేపట్టారు. ఆలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు.

నేడు మెట్ల పూజ, నృత్యోత్సవం

స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని ఆదివారం వైకుంఠద్వారం వద్ద మెట్ల పూజ, మెట్ల నృత్యోత్సవం ఉంటుందని భావనాలయ నాట్యాచార్యులు డాక్టర్ వట్టికోట యాదగిరి చార్యులు తెలిపారు. ఉదయం 9గంటలకు మొదటి మెట్టు వద్ద ప్రత్యేక పూజలు, జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం స్వామి వారి సంకీర్తనలకు నృత్యం చేస్తూ కొండపైకి నృత్యకారులు చేరుకుంటారని పేర్కొన్నారు. ఆ తర్వాత కుంభ నీరాజనంతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.

బరిగీసి.. బండ లాగి..



శివరాత్రి ఉత్సవాల్లో నిర్వహించే ఎడ్ల పందేలకు గిత్తలు సై అంటున్నాయి. బరిగీసి.. బండ లాగేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రత్యేక పర్యవేక్షకుల ద్వారా తర్ఫీదు పొందుతున్నాయి. లక్షల రూపాయల ఖర్చుకు సైతం వెనుకాడకుండా కొందరు ఔత్సాహికులు పోట్ల గిత్తలను పోషిస్తున్నారు.

సండే స్పెషల్

- ప్రత్యేక కథనం 8లో

పనులేవి స్వామీ..!

తొమ్మిది రోజుల్లో యాదాద్రి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

- భారీగా తరలిరానున్న భక్తులు
- ఎక్కడి పనులు అక్కడే
- ఆలయం ప్రారంభించినా సమకూరని వసతులు
- బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఉదాసీనత
- వైటీడీఏకు బడ్జెట్‌లో రూ.200 కోట్లు
- పాత బిల్లుకే సరిపోతాయంటున్న అధికారులు



కొండపైన నిలువ నీడలేక భక్తుల అవస్థలు



పూర్తికాని ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు



ప్రసాద విక్రయ కేంద్రం వద్ద భక్తుల పాట్లు

సాక్షి, యాదాద్రి : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి మార్చి 3వ తేదీ వరకు జరుగనున్నాయి. సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భవ్య యాదాద్రి ఆలయాన్ని గత సంవత్సరం మార్చి 28న ప్రారంభించిన తర్వాత తొలి బ్రహ్మోత్సవాలు ఇవే కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. అయితే, యాదాద్రిలో ఇంకా భక్తులకు కనీస వసతులు పూర్తిగా సమకూరలేదు. మరో 9 రోజుల్లో జరుగనున్న బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ఇంతవరకు చర్యలు ప్రారంభించలేదు.

రూ.200 కోట్లు పెండింగ్ పనులకే..

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వైటీడీఏ(యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ)కు రూ.200 కోట్లు కేటాయించింది. గడిచిన రెండు బడ్జెట్‌లలో రూ.350 కోట్ల చొప్పున రూ.700 కోట్లు కేటాయించారు. తాజాకేటాయింపులతో రూ.900 కోట్లు కేటాయింపు అయినప్పటికీ భక్తులకు పూర్తి స్థాయి వసతులు సమకూరలేదు. వైటీడీఏ అవసరాల భూసేకరణకు రూ.90 కోట్లు అవసరం కాగా, తక్షణ అవసరంగా రూ.42 కోట్లు విడుదల చేయాలి. అలాగే కొండపైన, కొండ కింద చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రూ.50 కోట్ల మేరకు కాంట్రాక్టు సంస్థలకు చెల్లించాల్సి ఉంది. వీటితోపాటు ప్రస్తుతం జరుగుతున్న పనులకు మరో రూ.60 కోట్లు వెంట వెంటనే చెల్లిస్తేనే భక్తుల వసతుల కోసం చేపట్టిన పనులు పూర్తి అవుతాయి.

పుష్కరిణిలో నీళ్లు లేవు

సహజ సిద్ధంగా కొండపైన ఏర్పడిన పవిత్రమైన విష్ణు పుష్కరిణిలో చుక్క నీరూ లేదు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చక్రతీర్థం ఇందులోనే చేస్తారు. అలాగే భక్తులు అత్యంత పవిత్రంగా భావించి పుష్కరిణిలో స్నానం చేస్తారు. పవిత్రమై గిరి ప్రదర్శన రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు

ఏమార్గం ఎటు పోతుందో..

వివిధ ప్రాంతాల నుంచి యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు ఆలయ అధికారులు సరైన సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో భక్తులు ఎటునుంచి కొండపైకి వెళ్లాలి, ఎక్కడ పుష్కరిణి, కల్యాణకట్ట, అన్నప్రసాదం, సత్యనారాయణ స్వామి వ్రత మండపం వంటివి తెలియడం లేదు. అంతేకాకుండా క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు రూ.150, రూ.300, ధర్మదర్శనం వంటి ప్రాంతాలకు వెళ్లే భక్తులకు సరైన సూచికలు లేవు.

స్వర్ణతాపడం కోసం విరాళాలు

శ్రీ స్వామివారి విమాన గోపురానికి స్వర్ణ తాపడం కోసం విరాళాల సేకరణ ఇంకా జరుగుతోంది. సీఎం కేసీఆర్ భక్తుల విరాళాలతో స్వర్ణ తాపడం పనులు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. 125 కిలోల బంగారం అవసరం కాగా ఇప్పటి వరకు రూ.33 కోట్ల నగదు, ఎనిమిది కిలోల బంగారం వచ్చింది. ప్రస్తుతం గోపురానికి కాపర్ పనులు జరుగుతున్నాయి.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షలేవీ..

ప్రపంచ స్థాయి దివ్యక్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రిలో జరిగే తొలి బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాదాయ శాఖ ముందస్తుగా నెల రోజుల ముందునుంచే సమీక్షా సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లు ప్రారంభించేది. భక్తుల వసతుల, బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వీఐపీల ఆహ్వానం, నిర్వహణకు అవసరమైన బడ్జెట్ వంటి వాటిని సంబంధిత శాఖ మంత్రి ఉన్నత స్థాయి అధికారులు, దేవస్థానం ఈవో, అర్చకులు చర్చించేవారు. ప్రస్తుతం ఆలయ ఈవో, కొందరు అధికారులు, అర్చకులు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు.

పూర్తికాని ఘాట్ రోడ్డు

ప్రస్తుతం కొండపైకి వెళ్లేందుకు ఒక్కటే ఘాట్ రోడ్డు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మొదటి ఘాట్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. రెండు చోట్ల మూల మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్య వైశ్య సత్రం నుంచి నేరుగా గుట్ట మీదికి వెళ్లడానికి చేపట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా సాగుతున్నాయి.



కొండపైకి వెళ్లే మొదటి ఘాట్ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్న దృశ్యం

సమస్యల కొండ

యాదగిరికొండ భక్తుల సమస్యలకు నిలయంగా మారింది. మిషన్ భగీరథ ద్వారా ప్రతి రోజు 20 లక్షల లీటర్ల మంచి నీటిని సరఫరా చేయాల్సి ఉన్నా అందులో సగం కూడా భక్తులకు అందడం లేదు. మంచి నీటి వసతి కోసం ప్రైవేట్‌కంపెనీ ఏర్పాటు చేసిన నల్లాలు భక్తుల దాహార్తిని తీర్చడం లేదు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన నల్లాలు సరిపోవడంలేదు, బంగారు వర్ణపు క్యూలైన్‌లో ఫ్యాన్లు, మంచినీటి వసతిలేదు. శ్రీ స్వామి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు సేదదీరడానికి ఆలయ పరిసరాల్లో కనీసం నిలువ నీడ లేదు. చలువ పందిళ్లు, షెడ్లు ఏర్పాటు చేయలేదు. వాష్‌రూంలు లేక భక్తుల అవస్థలు పడుతున్నారు. క్యూలైన్ల నుంచి బయటకు వచ్చి రిసెప్షన్ కౌంటర్ పక్కన గల వాటి కోసం పరుగులు తీస్తున్నారు. ప్రసాదాల విక్రయ కేంద్రం ఇరుకుగా మారడంతో భక్తుల మధ్య తోపులాట జరుగుతోంది. మెట్లమార్గంలో విద్యుత్ దీపాలు లేవు.




కొండపైన బస్సుల వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

సరిపోని ఆర్టీసీ బస్సులు

భక్తుల కోసం కొండపైకి దేవస్థానం ఉచితంగా ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. తొలుత 32 బస్సులను రోజూ నడిపించిన దేవస్థానం ఆ తర్వాత ఆర్థిక భారం మోయలేక వాటిని తగ్గించింది. ప్రస్తుతం 20 బస్సులు నడుస్తున్నాయి. 35 మంది ఎక్కాల్సిన బస్సులో రెండింతలు ఎక్కి ఘాట్‌రోడ్డులో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. కొండపైన బస్‌బేలోనే భక్తుల చెప్పుల స్టాండ్, సెల్ ఫోన్ సెంటర్, హోటల్ వంటి వ్యాపారాలను నడుపుతున్నారు.

సాగుతూ.. ఆగుతూ

భక్తుల వసతుల కోసం కొండకింద వైటీడీఏ చేపట్టిన పనులు ఇంకా సాగుతున్నా యి. శ్రీ స్వామి వారి తెప్పోత్సవం నిర్వహించడానికి గండి చెరువు పూర్తి కాలేదు. చెరువు మధ్యలో మండపం, చెరువు చుట్టూ గ్రీనరీ ఒక వైపు పూర్తికాగా, బెంచీలు, విద్యుత్ దీపాలంకరణ, కట్టపై సుందరీకరణ పనులు పూర్తి కాలేదు.నిత్యాన్నదాన భవనం పనులు సాగుతున్నాయి. దీంతో దీక్షాపరుల మండపంలోనే చాలీచాలని వసతుల నడుమ అన్నప్రసాదం అందిస్తున్నారు. రూ.6 కోట్లతో నిర్మిస్తున్న బస్టాండ్ పూర్తి కాలేదు. రూ.57 కోట్లతో చేపట్టిన దుకాణాల సముదాయాలు వివిధ దశల్లో ఉన్నాయి.



ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

- మంత్రి జగదీశ్‌రెడ్డి



ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు వచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

మోత్కూరు : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధి ధర్మాపురంలో దాత తాడూరు లక్ష్మారెడ్డి-పద్మజ దంపతుల రూ.50 లక్షల విరాళంతో పునర్నిర్మాణం చేసిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. భక్తిభావంతో సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడతాయన్నారు. లక్ష్మారెడ్డి, పద్మజ దంపతులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, జెడ్పీటీసీ గోరుపల్లి శారద, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, మార్కెట్ చైర్మన్ యాకూబ్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ సెల్ జిల్లా సభ్యుడు దాసరి తిరుమలేష్, కౌన్సిలర్లు మలిపెద్ది రజిత, కళ్యాణ్‌చక్రవర్తి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోరుపల్లి సంతోష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, గజ్జి మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

మరో 450 మందికి చాన్స్!

- 317 జీఓ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరణ
- ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు 1,803 మంది



భువనగిరి : 317 జీఓ ప్రకారం జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల నుంచి బదిలీ కోసం ఆదివారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాల పునర్విభజన సమయంలో ప్రభుత్వం జీఓ 317 ద్వారా ఉపాధ్యాయులను బదిలీ చేసింది. సర్వీస్‌ను పరిగణలోకి తీసుకుని తాజా బదిలీల్లో వారికి అవకాశం కల్పించాలని ఇటీవల హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో మరో 450 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునే అవకాశం లభించింది. ఇప్పటికే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో బదిలీల కోసం 1,803 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సవరించారిలా..

గతంలో విడుదల చేసిన ప్రకటన ప్రకారం మార్చి 4వ తేదీన బదిలీల ప్రక్రియ పూర్తికావల్సి ఉంది. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మార్చి 14వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 12నుంచి 14వ తేదీ వరకు జీఓ 317 ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. 21,22 తేదీల్లో సీనియార్టీ తుది జాబితా విడుదల చేయనున్నారు. 24న ప్రధానోపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు విడుదలవుతాయి. 26, 27, 28 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పిస్తారు.మార్చి 4,5న స్కూల్ అసిస్టెంట్ల బదిలీ జరుగుతాయి. 7,8,9వ తేదీల్లో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి , 14న ఎస్జీటీల బదిలీలు జరగనున్నాయి.

కొత్త షెడ్యూల్ ప్రకారం

జిల్లాలో జనాభా ప్రాతిపదికన ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రభుత్వం జీఓ తీసుకువచ్చింది. కొందరు సొంత జిల్లా నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చింది. రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారిని తాజాగా చేపడుతున్న బదిలీలకు అర్హులుగా ప్రకటించారు. దీంతో వీరు నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోనున్నారు.

బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : పట్టణంలో ప్రస్తుతం ఉన్న చోటనే బస్టాండ్‌ను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, యాదాద్రి దేవస్థానం మాజీ ధర్మకర్త గౌలికార్ అశోక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్లెం కృష్ణడిమాండ్ చేశారు. బస్టాండ్‌ను తొలగించవద్దని కోరుతూ స్థానిక సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బస్టాండ్ ఆధారంగా వందలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని, బస్టాండ్‌ను తరలిస్తే వారందరూ రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. పాత హైస్కూల్ స్థలంలో భక్తుల సౌకర్యార్థం వెయ్యి గదులు నిర్మించాలని డిమాండ్ చేశారు.ఈఓగా గీతారెడ్డిని తొలగించి ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మంద శంకర్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం, దండబోయిన అనిల్, బీఆర్‌ఎస్, ఆహ ఆద్మీ, జేఏసీ, కాంగ్రెస్ నాయకులు గడ్డం చంద్రం, గుండ్లపల్లి శ్రీరాం, మిరియాల కృష్ణ, బండి అనిల్, పేరబోయిన మహేందర్, కల్వకొలను సతీష్‌రాజ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు పస్తులుండకుండా..

- 15 నుంచి అల్పాహారం అందించాలని ప్రభుత్వ నిర్ణయం
- రూ.25.26 లక్షలు మంజూరు

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు ఈనెల 15నుంచి అల్పాహారం అందనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.25.26లక్షలు మంజూరు చేసింది. విద్యార్థులు పాఠశాలకు ఉదయం 8 గంటలకు వెళ్లి ఇళ్లకు చేరేసరికి రాత్రి 8 అవుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

4,954 మంది విద్యార్థులకు ప్రయోజనం

జిల్లాలో 163 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులు 4,954 మంది ఉన్నారు. ప్రతి విద్యార్థికి రోజుకు రూ.15ల చొప్పున ఖర్చు చేసి అల్పాహారం అందించనున్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్

భువనగిరి : లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు వి.బాలభాస్కర్‌రావు అన్నారు. శనివారం భువనగిరిలోని జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షణికావేశం, చిన్న విషయాలకు ఘర్షణ పడి న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు.

8,890 కేసులు పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 8,890 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇందులో 13 సివిల్, 8868 క్రిమినల్ కేసులు, యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐకి చెందిన ప్రీ లిటిగేషన్ కేసులు 9 ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దశరథరామయ్య, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతిదేవి, ప్రధాన జీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, స్పెషల్ మెజిస్ట్రేట్ జావీద్, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి రాంరెడ్డి, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల మేనేజర్లు, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ఏనుగులను తలపించే బలమైన కాడెద్దులు.. వాటి మెడలోని కాడికి క్వింటాళ్ల కొద్దీ బరువుండే బండరాళ్లు.. బండను లాగడానికి గిత్తలను సంసిద్ధం చేయడానికి చెర్నకోలాలను పట్టుకొని హడావుడి చేసే ట్రైనర్లు.. పందెపుటెడ్ల చుట్టూ చేరి ఈలలు, కేరింతలతో ప్రేక్షకులు చేసే సందడి.. ఏ గిత్తలు గెలుస్తాయో అనే ఆత్రుత, ఉత్కంఠ. శివరాత్రి వచ్చిందంటే.. దేవాలయాల వద్ద నిర్వహించే సంప్రదాయపు ఎండ్ల పందేల వద్ద కనిపించే దృశ్యాలు ఇవీ..


ఇటీవల కోదాడలో జరిగిన పోటీల్లో బండ లాగుతున్న గిత్తలు

• బుల్ షో

బరిగీసి.. బండ లాగి..

పోటీకి సై అంటున్న పోట్లగిత్తలు

- శివరాత్రి జాతర్లలో ప్రత్యేక ఆకర్షణగా పోటీలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల నిర్వహణ
- ఇతర రాష్ట్రాల్లో జరిగే పోటీలకూ మన పోట్ల గిత్తలు
- రూ.లక్షలు ఖర్చుచేసి గిత్తలను పోషిస్తున్న ఔత్సాహికులు
- వాటికి ఆహారం.. శిక్షణ ప్రత్యేకమే..
- ఒక జత గిత్తలకు ఏడుగురు ట్రైనర్లు
- నిరంతరం గిత్తలను చూసుకునేందుకు ఇద్దరు పర్యవేక్షకులు
- పేరు, సరదా కోసమే పందెపుటెడ్ల పెంపకం


హుజూర్‌నగర్‌లోని సుంకి సురేందర్‌రెడ్డి గిత్తలకు తర్ఫీదు ఇస్తున్న శిక్షకులు

(సాక్షి, నల్లగొండ డెస్క్)

పోట్ల గిత్తలు సత్తా చూపేందుకు బరిలు సిద్ధమవుతున్నాయి. ప్రతియేటా శివరాత్రి సందర్భంగా పలుచోట్ల జాతరల వద్ద జరిగే పోటీలకు గిత్తలు రెడీ అవుతున్నాయి. ఒకప్పుడు ఆంధ్రా ప్రాంతానికే పరిమితమైన ఎడ్ల పందేలపై ఇప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సైతం పలువురు రైతులు ఉత్సుకత చూపుతున్నారు. లక్షల రూపాయల ఖర్చుకు కూడా వెనుకాడకుండా గిత్తలను పెంచుతున్నారు. ఎడ్ల పందేల్లో గెలుపు ఇచ్చే కిక్ కోసం పోటీలు ఉన్న ప్రతి చోటుకూ వెళ్తున్నారు. తమ పోట్ల గిత్తలను కన్న బిడ్డలకన్నా మిన్నగా పెంచుకుంటున్నారు. గిత్తలను పెంచడం, వాటని పోటీలకు తీసుకెళ్లడం, అవి గెలుపొందడం తమ స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. తమ గిత్తలను బరిలోకి దింపి విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గిత్తలను పెంచడం కోసం వీరు చేస్తున్న ఖర్చులో సగం కూడా రాని పందెం డబ్బు కోసం కాకుండా.. పేరు, పరపతిగా భావించి పోటీల్లో పాల్గొంటున్నారు.

సండే స్పెషల్


గిత్తలను నీటితో కడుగుతున్న పర్యవేక్షకుడు

ఎలా మొదలయ్యాయంటే..

వ్యవసాయంలో అన్నదాతలకు చేదోడు వాదోడుగా ఉండే ఎద్దులను రైతులు సొంత బిడ్డల్లా సాకుతారు. తాము పెంచే ఎద్దుల సామర్థ్యాన్ని చాటుకోవడం కోసం, ఎంత బలిష్టంగా ఉన్నాయో చెప్పుకోవడానికి గతంలో చిన్నచిన్న బండరాళ్లను, ఇసుక బస్తాలను కట్టి లాగించే వారు. ఇదే కాలక్రమేణ ఎడ్ల పందేలుగా మారింది. క్వింటాళ్ల కొద్దీ బరువుండే బండరాళ్లను లాగే పోట్ల గిత్తలను తయారు చేసి వాటికి బలమైన ఆహారాన్ని ఇస్తూ పోటీలకు సై అంటూ ముందుకు పోతున్నారు ఔత్సాహికులు.

రోజూ శిక్షణ

పందెపు గిత్తలను వ్యవసాయ పనులు చేయిస్తూనే మరో పక్క వీటికి బండ లాగే పోటీలో శిక్షణ ఇస్తుంటారు. రోజూ తెల్లవారు జామునే షెడ్ల నుంచి బయటకు తీసుకొచ్చి దాదాపు కిలోమీటరు దూరం నడిపిస్తారు. కొంత దూరం ఉరికిస్తారు. పోటీల సీజన్‌లో మాత్రం వారంలో రెండు రోజులు వీటికి బండరాళ్లను కట్టి లాగిస్తూ ట్రెనింగ్ ఇస్తారు. మరో రెండు రోజులు టైర్‌బేటా వేస్తారు. దీని కోసం ప్రత్యేకంగా కొందరిని నియమిస్తారు. ఆ తరువాత బలమైన ఆహారం ఇస్తారు.



గుంటూరు జిల్లా తూములూరులో బహుమతి అందుకుంటున్న సుంకి సురేందర్‌రెడ్డి (ఫైల్)

పోటీలు ఇలా..

ఎడ్ల పందేల్లో ముఖ్యమైనది వివిధ బరువులతో ఉండే బండ రాళ్లను లాగడం. సాధారణంగా పోటీలకు నిర్వాహకులు రెండు రకాల బరులను సిద్ధం చేస్తారు. ఒకటి 200 అడుగులు, మరొకటి 300 అడుగుల పొడవు ఏర్పాటు చేస్తారు. 20 అడుగుల వెడల్పు ఉంటుంది. బరిలో ఒక వైపు నుంచి రెండవ వైపు వెళ్లి మళ్లీ మొదటి వైపునకు వస్తే ఒక రౌండ్ అంటారు. ఇలా నిర్ణీత సమయంలో ఎన్ని ఎక్కువ రౌండ్లు వేస్తే ఆ జత గెలిచినట్లుగా ప్రకటిస్తారు. పందేలు నిర్వహించే చోటు నుంచి దాదాపు 15 చానళ్లు లైవ్ ఇస్తాయి. పోటీల వీడియోలు కూడా అందుబాటులో ఉంచుతాయి.

దూడల ఎంపిక కీలకం

ఎడ్ల పందేలకు గిత్తలను తయారు చేయాలనుకునే వారు అవి దూడలుగా ఉన్న సమయంలోనే ఎంపిక చేసుకుంటారు. సాధారణంగా ఒంగోలు జాతి దూడలను ఎంచుకుంటారు. పోటీల్లో రాణించాలంటే గిత్తలకు ఎముక బలం ఎక్కువగా ఉండాలి. గంగడోలు, గిట్టలు, తోక పొడవు, చెవులు ఇలా ప్రతి లక్షణం చూసి దూడలను ఎంపిక చేసుకుంటారు. పాలు మరిచిన సమయంలోనే గ్రామాల్లో లేదా, పేరున్న సంతల్లో వీటిని కొనుగోలు చేస్తారు. పాలు మరిచిన దూడల ఖరీదు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. ఇవి కొంచెం పెద్దవి కాగానే వాటిని వ్యవసాయ పనులకు సాగదీస్తారు. వ్యవసాయ పనులు చేస్తేనే **గిత్తలు బలిష్టంగా ఎదుగుతాయని రైతులు భావిస్తారు.**


కోదాడ : రామలక్ష్మీపురంలో శ్రీనివాసరెడ్డి పెంచుతున్న గిత్త

ఖర్చు దండిగానే..

పందెపుటెడ్లను సాదాలంటే డబ్బులు దండిగానే ఉండాలి. **జత** గిత్తలకు **రోజువారి** దాణ, **ఇతర** ఖర్చులు **కలిపి** దాదాపు **2,400** వరకు అవుతాయి. దీంతో **పాటు** వీటి కోసం **ఇద్దరు** ట్రైనర్లు ఉండాలి. ఇలా జత **పందెపుటెడ్ల** ఖర్చు **నెలకు** రూ.50 వేల **నుంచి రూ.60 వేల** వరకు వస్తుంది. ఇలా పెంచిన ఎద్దులు పందేలకు వెళ్లి **రూ.లక్ష నుం**చి రూ.ఐదు **లక్షల వరకు ప్రైజ్‌మనీ** గెలుచుకున్న **సందర్భాలు ఉంటాయి. వీటి**ని పందెలు జరిగే ప్రదేశాలకు తరలించడానిక ప్రత్యేకంగా తయారు చేయించిన డీసీఎం వ్యాను కూడా ఏర్పాటు చేస్తారు.

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎద్దుల పోటీలు జరిగే ప్రాంతాలు : మేళ్లచెర్వు, మఠంపల్లి, దొండపాడు, రఘునాథపాలెం, నక్కగూడెం, చింత్రియాల, రేబల్లె, వేపల మాదారం, కోదాడ, బేతవోలు, బట్టుగూడెం, రామన్నగూడెం, తిరుమలగిరి, కుంకుడుచెట్టుతండా. ఆయా గ్రామాల్లో జరిగే జాతరల సందర్భంగా ఎద్దుల పోటీలు నిర్వహిస్తారు. అయితే మేళ్లచెర్వులో నిర్వహించే పందేలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది.

పోటీల్లో కేటగిరీలు ఇలా..

ఎడ్ల పందేల్లో గిత్తల వయస్సును బట్టి వీటిని వివిధ కేటగిరీలుగా విభజిస్తారు

కేటగిరీ	వేసే బండ బరువు (క్వింటాళ్లు)	లాగే సమయం (నిమిషాల్లో)
టచ్‌పళ్ల గిత్తలు (వీటికి ఇంకా పళ్లు రావు)	4 నుంచి 5	10
జతపళ్ల గిత్తలు (వయసు 2సంవత్సరాల పైన)	6 నుంచి 8	10
నాలుగు పళ్ల గిత్తలు (2 నుంచి 3సంవత్సరాల లోపు)	8 నుంచి 10	15
ఆరుపళ్ల గిత్తలు (3 నుంచి 4సంవత్సరాల లోపు)	10 నుంచి 12	15
వ్యవసాయ విభాగం	12 నుంచి 16	20
సబ్ జూనియర్ విభాగం	16 నుంచి 18	20
జూనియర్ విభాగం	18 నుంచి 20	20
సీనియర్ విభాగం	20 నుంచి 24	25


సీనియర్ విభాగానికి వచ్చిన ఎద్దులు వయస్సు 7 సంవత్సరాలు ఉంటుంది.

అదిరిపోయే ఆహారం..


గిత్తలకు తయారవుతున్న దాణా


బీన్స్


బీట్‌రూట్


కొర్రలు


నువ్వుల పిండి


రాగులు

- గిత్తలకు పొద్దున్నే ఎండు ఖర్జూరా, అంజీరా తినిపిస్తారు. ఎండుగడ్డిని పెట్టి ఆ తరువాత శుభ్రమైన నీటితో కడుగుతారు. తడి ఆరిన తరువాత షెడ్లలోకి తీసుకువస్తారు. వేసవిలో వీటిని ఉదయం, సాయంత్రం నీటితో కడుగుతారు.
- షెడ్లలోకి రాగానే ఉలవ పిండి దాణాతో పాటు బీన్స్, బీట్‌రూట్, ఆపిల్ ముక్కలు చేసి పెడతారు. బాదం పప్పులను నానబెట్టి ముద్దగా చేసి తినిపిస్తారు.
- మధ్యాహ్నం బార్లీ, రాగులు, కొర్రలతో చేసిన జావను తాగిస్తారు. సాయంత్రం మరోసారి ఉలవ పిండి దాణా పెడతారు. ఇక ఉదయం నుంచి రాత్రి వరకు ఎండు గడ్డి నిరంతరం వేస్తుంటారు. ఎండు జొన్న చొప్ప కూడా వేస్తారు. మధ్యాహ్నం పచ్చి జొన్నగడ్డి వేస్తారు.
- ఆరోగ్యంగా ఉండడానికి బలవర్ధకర ఆహారంతో పాటు గిత్తలో బలం, గట్టిదనం కోసం మందులను ఇస్తుంటారు. వారాని రెండు సార్లు కాల్షియం సిరప్‌ను దాణాలో కలిపి ఇస్తారు. గిత్తల లివర్ ఆరోగ్యంగా ఉండడానికి వాటికి అప్పుడప్పుడు బ్రోటోన్ లిక్విడ్‌తో పాటు కొన్ని రకాల విటమిన్లను దాణాలో కలిపి ఇస్తారు. అంతే కాకుండా నెలకు రెండు సార్లు పశువైద్యుడి చేత చెకప్ చేయిస్తారు. పెంపకందారులు ఎక్కువగా గిత్తలకు హోమియోపతి మందులు ఇస్తారు. ఈగలు, దోమలు రాకుండా నిరంతరం షెడ్లలో ఫ్యాన్లు తిరుగుతుంటాయి. గిత్తల విసర్జితాలను ఎప్పటికప్పుడు తొలగించి షెడ్లను శుభ్రం చేస్తుంటారు. గిత్తలు పడుకునేందుకు వీలుగా కింద మ్యాట్‌లు వేస్తారు.

పోటీల్లో పాల్గొనడం సరదా..



తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన ఎడ్ల పందాల్లో నా గిత్తలకు ప్రతి చోటా ప్రైజ్ వచ్చింది. నాకు ఎడ్ల పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి కలగడంతో 2014లో రెండు లక్షల రూపాయలకు ఒకటి చొప్పున రెండు ఎడ్లను కొనుగోలు చేశాను. తొమ్మిది సంవత్సరాల్లో మూడు జతల పందెం ఎడ్లను సాకాను. వయస్సు పైబడడంతో రెండు జతలు అమ్మేశాను. ఇప్పుడు మూడో జతతో ఎడ్ల పందేలకు వెళ్తున్నా. వాటికి రోజూ వెయ్యి రూపాయల వరకు దాణా ఖర్చు అవుతుంది. ఉదయం బాదం పప్పు, ఉలవలు, రెండు లీటర్ల ఆవు పాలు, మధ్యాహ్నం, రాత్రి కూడా ఉలవలు, జొన్న లాంటి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నా. ప్రస్తుతం ఉన్న ఎద్దులతో 18 క్వింటాళ్ల బండ రాయి(జూనియర్) లాగే పోటీలకు తీసుకెళ్తున్నా. పోటీల్లో గెలిస్తే వచ్చే ఆదాయం కోసం కాకుండా పాల్గొనడం ఒక సరదాగా మారింది.

– సంకూరి అనంతరాములు, సూరేపల్లి, నిడమనూరు మండలం

ఆదాయం కోసం కాదు.. పేరు కోసమే..



నేను 16 ఏళ్లుగా ఎద్దుల పోటీల్లో పాల్గొంటున్న. నల్లగొండతోపాటు ఖమ్మం, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో జరిగే ఎద్దుల పోటీల్లో పాల్గొన్నా. ఇప్పటి వరకు 200కు పైగా బహుమతులు వచ్చాయి. పోటీల్లో పాల్గొనే ఎద్దులకు ప్రత్యేక ఆహారంతో పాటు తర్ఫీదు ఇవ్వాలి. అవి దూడగా ఉన్నప్పుడు తీసుకుని వచ్చి తర్ఫీదు ఇస్తాం. మరికొన్నింటిని నేరుగా కొనుగోలు చేస్తుంటాం. ప్రస్తుతం నా వద్ద నాలుగు ఎద్దులు ఉన్నాయి. వీటి విలువ రూ.30 లక్షలకు పైగా ఉంటుంవొ. 60 సంవత్సరాలుగా మా ఇంట్లో పందెపు ఎద్దులు ఉండేవి. ఆ సంప్రదాయాన్ని అలాగే కొనసాగిస్తున్నా. ఎద్దుల పోషణ ఖర్చులకు.. వచ్చిన బహుమతులు, డబ్బులు ఏ మూలకూ సరిపోవు. వారసత్వంగా వస్తున్న పేరు నిలబడటం కోసమే ఎద్దుల పోటీలకు వెళ్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మీపురం, కోదాడ మండలం

చిన్నప్పటి నుంచి ఎద్దులు అంటే ఇష్టం



నేను స్వతహాగా జంతు ప్రేమికుడిని. అందులో ఎద్దులు అంటే చాలా ఇష్టం. మాది వ్యవసాయ కుటుంబం. మా తాత కాలం నుంచి మాకు పశుసంపద బాగా ఉండేది. ఎద్దులను బాగా చూసుకోవడం, బలిష్టంగా పెంచడం ఒక అలవాటుగా మారింది. నేను పోలీస్ శాఖలో చేరి దూరప్రాంతంలో ఉద్యోగం చేస్తున్నా.. తరచుగా హుజూర్‌నగర్‌లోని వ్యవసాయాన్ని, ఎద్దులను చూసుకునేందుకు వస్తున్నా. పందెం గిత్తలను ప్రత్యేకంగా పోషిస్తున్నాం. పోటీలకు ఉపయోగపడే లక్షణాలున్న దూడలను కొనుగోలు చేసి వాటిని ప్రత్యేకంగా పెంచుతాం. వాటిని నిరంతరం చూసుకునేందుకు వర్కర్లను పెట్టాను. 2007 సంవత్సరం నుంచి ఎద్దుల పోటీల్లో పాల్గొంటున్నా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కర్నాటకలోనూ జరిగిన పోటీల్లో మా గిత్తలు పాల్గొన్నాయి. ఇప్పుడు ఏపీ, తెలంగాణతో పాటు రాయచూర్‌లో పోటీలకు వెళ్తున్నాయి. అనేక చోట్ల బహుమతులు పొందాయి.

– సురేందర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ, జీహెచ్ఎంసీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన పోలీసులు

బీబీనగర్: ఆర్థిక ఇబ్బందులను తాళలేక ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమై రైల్వే ట్రాక్‌పైకి వెళ్లిన ఓ వ్యక్తిని బీబీనగర్ పోలీస్‌లు కాపాడారు. ఈ ఘటన శనివారం బీబీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన లక్క సుబ్రమణ్యం 18ఏళ్ల క్రితం బీబీనగర్‌కు వలస వచ్చి ఇక్కడే కుటుంబ సభ్యులతో స్థిరపడిపోయారు. సుబ్రమణ్యం ఓప్రైవేట్ పరిశ్రమలో పని చేయగా ఇటీవల కాలంలో మానేశాడు. వయసు రీత్యా సుబ్రమణ్యం పరిశ్రమల్లో పని చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారడంతో పాటు అప్పులు కావడంతో చనిపోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో శనివారం బీబీనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి తాను అత్మహత్య చేసుకుంటున్నానని తన బావకు ఫోన్‌లో సమచారం ఇచ్చాడు. దీంతో సుబ్రమణ్యం బావ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన సుబ్రమణ్యం ఫోన్‌ను ట్రేస్ చేసి తాను ఉన్న రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి రైలు కింద పడకుండా కాపాడారు. అనంతరం సుబ్రమణ్యంకు పోలీస్‌లు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.


రైల్వే ట్రాక్‌పై సుబ్రమణ్యంకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

సోషల్ మీడియాలో అవుట్‌డోర్ స్టేడియం నమూనా వైరల్

భువనగిరి : భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలోని మైదానంలో అవుట్ డోర్‌స్టేడియం ఏర్పాటుకు సంబంధించిన నమూనా ఫొటోలు శనివారం భువనగిరిలో వాట్సాప్‌లో చక్కర్లు కొట్టాయి. కాగా ప్రస్తుతం కళాశాల ఆవరణంలో మైదానం సమతలం చేసే పనులు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ అవుట్‌డోర్‌స్టేడియం ఏర్పాట్లు చేస్తామని దీనికి కోసం టీయూఎఫ్ఐడీసీ కింద వచ్చిన నిధులలో రూ.5కోట్లు వరకు కేటాయించారు. కానీ ఈ నిధులను తిరిగి వార్డుల అభివృద్ధికి మళ్లించినట్లు సమాచారం. తిరిగి ఈ మైదానాన్ని అవుట్ డోర్‌స్టేడియంగా మార్చేందుకు తాజాగా టీయూఎఫ్ఐడీసీ కింద రెండో విడుత ద్వారా మంజూరైన నిధులలో కేటాయిస్తారా లేదా అని చర్చనీయాంశంగా మారింది. ఈ మైదానం స్టేడియంగా అభివృద్ధి చేస్తే జిల్లా కేంద్రంలో స్టేడియం ఉండటం వల్ల క్రీడాకారులకు ఇబ్బందులు తొలిగే అవకాశం లేకపోలేదు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

మోత్కూరు : తాటి చెట్టుపై నుంచిజారిపడి ఓ గీత కార్మికుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మోత్కూరు మండలంలోని అనాజిపురం గ్రామంలో శనివారం సాయంత్రం సంఘటన చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీమగాని చంద్రయ్య సాయంత్రం మల్లన్న కుంట ప్రాంతంలో తాటి చెట్టు ఎక్కి కల్లు తీసి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మోత్కూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి అనంతరం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కాల్వలో పడి చిన్నారి మృతి

- అనుముల మండల పరిధి పంగవానికుంటలో విషాదం

హాలియా : అభం శుభం తెలియని ఓ తొమ్మిదేళ్ల పసిపాప ఆటలాడుకుంటూ వెళ్లి ఇంటి పక్కనే ఉన్న రాజవరం మేజర్ కాల్వలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృత్యుఒడికి చేరింది. ఈ ఘటన అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పంగవానికుంట గ్రామానికి చెందిన ఇరిగిదిండ్ల సైదులు, రేణుక దంపతులకు కుమార్తె కీర్తన (09), కుమారుడు నరేష్ కలరు. రెక్కాడితే డొక్కాడని కుటుంబం కావడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో తమ ఇద్దరి పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె కీర్తన ప్రాథమిక పాఠశాల్లో మూడవ తరగతి చదువుతుండగా కుమారుడు రెండవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లి వచ్చిన కీర్తన శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఆటలాడు కుంటూ పక్కనే ఉన్న రాజవరం మేజర్ కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి నీట మునిగి మృత్యువాత పడింది. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలం వద్దకు చేరిన కుటుంబ సభ్యులు, బంధువులు చిన్నారి కీర్తన ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న చిన్నారి కీర్తన విగత జీవిగా కళ్లముందు నిలవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కన్నవారు, బంధువుల రోదనలతో ఆ ఊరు శోకసంద్రమే అయింది. హాలియా-నాగార్జున సాగర్ 167వ జాతీయ రహదారి పంగవానికుంట గ్రామం మీదుగా ఉంది. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా రాజవరం మేజర్ కాల్వపై నూతన బ్రిడ్జిని నిర్మించి గతంలో కాల్వకు ఇరువైపులా ఉన్న మెట్లను తొలగించారు. కాల్వకు ఇరువైపులా రక్షణ ఏర్పాటు చేయకపోవడం కారణంగానే చిన్నారి కాల్వలో పడి మృతి చెందిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: రైలు నుండి కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడుజ ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం రామాజీపేట పరిధిలోని రైల్వే ట్రాక్ 253,13-15 మైలు రాయి వద్ద శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాజీపేట గ్రామం వద్ద రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి తెల్లవారు జామున మృతదేహం పడి ఉండడం చూసి, గ్రామస్తులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతుడు నీలాపు రఘునాథరెడ్డి (45) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్టణం వాసిగా పోలీసులు గుర్తించారు. కాగా గుర్తు తెలియని రైలు నుంచి, ఉదయం కింద పడి ఉండవచ్చని, రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

గాయపడిన యువకుడు మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాందంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలంలోని మండ్లపాక గ్రామానికి చెందిన మంత్రి సత్తిబాబు(30) వృత్తిరీత్యా తాపిమేస్త్రీగా పని చేస్తున్నాడు. అందులో భాగంగా 20రోజుల క్రితం, చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కులో పని చేసేందుకు వచ్చి అందులోనే ఉంటున్నాడు. ఈనెల 5న సత్తిబాబు అతని స్నేహితులైన మోర్కొండి ఏసు, పులపాకల సతీష్‌లు కలిసి కూరగాయలు తెచ్చుకునేందుకు దండుమల్కాపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇండస్ట్రీయల్ పార్కు దారిలో బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న ఏసుతో పాటు సతీష్, సత్తిబాబులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన సత్తిబాబును హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి మేనమామ మూడెడ్ల వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సీతపాండు తెలిపారు.